సైబర్‌ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో ఏహెచ్‌టీయూ ఎస్సైలు

మల్లాపూర్‌: రాచకొండ పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు రాచకొండ ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్‌ ఆదేశాల మేరకు 'యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌' (ఏహెచ్‌టీయూ) రాచకొండ ఆధ్వర్యంలో నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్‌ హైస్కూల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులకు సైబర్‌ మోసాలు, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌, చైల్డ్‌ లేబర్‌, డ్రగ్స్‌, మైనర్లు బైక్‌రైడింగ్‌ వంటి విషయాలపై కూలకషంగా అవగాహన కల్పించారు. సైబర్‌ బెదిరింపులు, సైబర్‌ మోసాలకు గురైతే సైబర్‌క్రైమ్స్‌ డయల్‌ 1930, ఎమెన్‌ హెల్ప్‌లైన్‌ 1091/181, హెల్ప్‌లైన్‌ 1098/ 112ను సంప్రదించాలన్నారు. ఎస్సైలు వెంకట శ్రీను, రాములునాయక్‌, ఏఎస్సై వెంకటస్వామి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌కుమార్‌

గౌతంనగర్‌: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌కుమార్‌ అన్నారు. మల్కాజిగిరి డివిజన్‌ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌ కాలనీలో రూ. 83 లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్కాజిగిరి డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. జలమండలి మేనేజర్‌ నవీన్‌, సూపర్‌వైజర్‌ నాగార్జున, దుర్గాప్రసాద్‌, సంజీవ్‌, మధు, లక్ష్మీనారాయణ, రాము యాదవ్‌, శ్రవణ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో రూ.52 లక్షలతో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. అల్వాల్‌ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఏఈ అభిషేక్‌, రామారావు, నరేందర్‌రెడ్డి, ప్రేమ్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

అభినందన


అభినందిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మౌలాలి: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా స్థాయి సైన్స్‌ఫేయిర్‌లో సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో జిల్లాస్థాయిలో 16 మందిని ఎంపిక చేయగా.. మల్కాజిగిరి మండలం దీన్‌దయాల్‌నగర్‌లోని సెయింట్‌ మార్క్స్‌ గ్రామర్‌ హైస్కూల్‌ విద్యార్థి విశ్వేష్‌ 'మోడ్రన్‌ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్‌' అనే ఎగ్జిబిట్‌ రాష్ట్రస్థాయికి ఎన్నికైంది. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ మల్లికార్జున్‌ మాట్లాడుతూ.. తమ విద్యార్థి రాష్ట్ర స్థాయి ప్రాజెక్టుకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో డాక్టర్‌ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి

అల్వాల్‌: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మి గణపతి ఆలయం స్వామివారి వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి సుప్రభాతసేవ నిర్వహించి 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష హోమాలు నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకులు, కార్య నిర్వాహకులు డాక్టర్‌ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి తెలిపారు. అన్నప్రసాద ట్రస్టు ద్వారా నిత్యాన్నప్రసాదం ఉంటుందని భక్తుల నుంచి విరాళాలను ఆహ్వానిస్తున్నామన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ మంత్రి మహమూద్‌ అలీ

మల్లాపూర్‌: నాచారం బాబానగర్‌లోని అజ్రత్‌ సయ్యద్‌ మహ్మద్‌ షావలీ దర్గా ఫాతియా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి, ఎమ్మెల్సీ మహమూద్‌అలీ హాజరయ్యారు. మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి, గ్రేటర్‌ బీఆర్‌ఎస్‌ నేత సాయిజెనోఖర్‌, రాష్ట్ర మైనార్టీ నేత బద్రేద్దీన్‌, షేక్‌ అహ్మద్‌ ఖాద్రీ, షేక్‌గేలామ్‌ షా, హుస్సేన్‌, అయ్యూబ్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: యువత క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. కర్నాటకలో జరిగే 8వ ఫెడరేషన్‌ కప్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ పురుషుల జట్టు ఏఎస్‌రావునగర్‌ మారుతి బాల్‌ బ్యాడ్మింటన్‌ గ్రౌండ్‌లో సన్నద్ధ శిబిరం ఏర్పాటు చేశారు.


బ్యాడ్మింటన్‌ ఆడుతున్న ఎమ్మెల్యే


క్రీడాకారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

బుధవారం శిబిరం ముగింపు సందర్భంగా క్రీడాకారులను కలిసిన ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.
– కాసేపు క్రీడాకారులతో కలసి బ్యాడ్మింటన్‌ ఆడిన ఎమ్మెల్యే వారిలో ఉత్సాహాన్ని నింపారు. కాలనీవాసుల అభ్యర్థనతో తన వంతు సహకారంగా ఏఎస్‌రావునగర్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ మైదానానికి సీసీ కెమెరాలు, ప్రహరీ, టాయిలెట్స్‌ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, బీఆర్‌ఎస్‌ నేతలు సోమశేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, తెలంగాణ బాల్‌ బ్యాడ్మింటన్‌ ప్రధానకార్యదర్శి వీవీ రమణ, రామకృష్ణారావు, రవీందర్‌గౌడ్‌, వీర భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

కుషాయిగూడ: చర్లపల్లి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రాచకొండ సీపీ సు. దీర్‌బాబు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి చర్లపల్లి పారిశ్రామికవాడలో విజిబుల్‌ పోలీసింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడలోని సురాన చౌరస్తా, చిన్న చర్లపల్లి ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్‌ రవీందర్‌ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నెంబరు ప్లేట్లు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంతలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్‌ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందని, ఇన్‌స్పెక్టర్‌ రవీందర్‌ అన్నారు. ఎస్సైలు శేఖర్‌, నర్సింహ్మ, హరీందర్‌ సిబ్బంది పాల్గొన్నారు.


చర్లపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బాల మల్లేష్‌ ఆశయాలను కొనసాగిస్తాం


అల్వాల్‌లో బాల మల్లేష్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అల్వాల్‌: పట్టణ సమితి ఆధ్వర్యంలో అల్వాల్‌ మున్సిపల్‌ కార్యాలయం ఎదుట బాల మల్లేష్‌ సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్‌ హాజరై ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల మల్లేష్‌ విద్యార్థి దశ నుంచే యువజన నాయకుడి నుంచి అంచలంచెలుగా ఎదిగి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. గత నెల 30న ఆయన గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. సీఎల్‌. యాదగిరి, ఏఐటీయూసీ మేడ్చల్‌ జిల్లా సమితి నాయకుడు మహేందర్‌. డీఎస్‌ శేఖర్‌, సయ్యద్‌ కౌసర్‌. జల్లి తిరుపతి, శ్రీనివాస్‌, బీఐ. శ్రీనివాస్‌, డి. నాగేష్‌, పద్మారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో ట్రంక్‌లైన్‌ మరమ్మతులు


కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి, జలమండలి అధికారులు తదితరులు

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో సరైన ఔట్‌లెట్‌ వసతి లేక నిత్యం మురుగుతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో ట్రంక్‌లైన్‌ మరమ్మత్తులకు రూ. 8 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇందులో బాగంగా గ్రేటర్‌ పరిధిలో ఉప్పల్‌ సర్కిల్‌కు మొదటి సారిగా కేటాయించిన ఆధునాతన సాంకేతికతతో తయారు చేసిన సూపర్‌ సక్కర్‌ వాహనాన్ని స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉప్పల్‌ నల్లచెరువు నుంచి రామంతాపూర్‌ రామిరెడ్డినగర్‌ వరకు ఉన్న ట్రంక్‌ లైన్‌ క్లీనింగ్‌ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దాదాపుగా 10 ఏళ్ల ట్రంక్‌ లైన్‌ ఉన్నా కూడా ఉపయోగంలో లేకుండా పోయిందని దీనితో దాదాపు 30 కాలనీలకు మురుగు నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. జలమండలి జీఎం సంతోష్‌కుమార్‌, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, మేనేజర్‌ సత్యనారాయణ, డివిజన్‌ నాయకులు బాకారం లక్ష్మణ్‌, తుమ్మల దేవిరెడ్డి, మోహన్‌రెడ్డి, లుకాస్‌, మురళి పాల్గొన్నారు.

నేడు నేల సంరక్షణపై అవగాహన

సాక్షి,సిటీబ్యూరో: ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని రైతు వేదికలలో మృత్తిక (నేల) సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. మానవాళికి ఆహారం అందించే నేలని సంరక్షించుకున్నట్లయితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించే వ్యవసాయాన్ని పండుగ చేయగలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతి రైతు వేదికలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారన్నారు. వ్యవసాయ అధికారులతో సహా కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించే పద్ధతితో సహా నేల ఆరోగ్య సూచికను ఎలా అర్థం చేసుకోవాలో రైతులకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మృత్తిక (నేల) సంరక్షణపై అవగాహన పొందాలని కోరారు.

8న భగవద్గీత శ్లోకాల పోటీలు

రామంతాపూర్‌: గీతాజయంతి సందర్భంగా కమలాకర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 14 ఏళ్ల లోపు చిన్నారులకు భగవద్గీత శ్లోకాల పోటీలను ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్‌ భారతి కమలాకర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్‌, జూనియర్‌, సబ్‌ జూనియర్‌ పోటీలను రామంతాపూర్‌ గోకుల్‌నగర్‌లోని సంగీత నృత్య అకాడమీలో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు 7675955208, 9490382454.

నివాళి

అల్వాల్‌: ఉమ్మడి అంధ్రప్రదేశ్‌ మాజీ సీఎం రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌ గుప్తా బుధవారం ఘనంగా నివాళులర్పించారు.

నోట్‌బుక్స్‌ పంపిణీ



మల్లాపూర్‌: మెట్రో వాటర్‌ ఔట్‌సోర్సింగ్‌ కార్మికుడు శ్రీనివాస్‌ జన్మదినం సందర్భంగా మల్లాపూర్‌ దత్తాత్రేయనగర్‌లోని లైఫ్‌ ఆఫ్‌ చిల్డ్రన్స్‌ హోమ్‌ హాస్టల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్‌, పెన్నులు పంపిణీ చేశారు.

పాన్‌షాప్‌ గొడవ కేసులో నిందితుడి అరెస్ట్‌

అల్వాల్‌: పాన్‌షాప్‌ వద్ద జరిగిన గొడవలో వ్యక్తి మృతి చెందిన కేసులో నిందితుడిని నేరేడ్‌మెట్‌ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న వినాయక్‌నగర్‌ చౌరస్తాలోని పాన్‌షాప్‌ వద్ద పాన్‌ కొనుగోలు చేయడానికి బండారి రాము అనే వ్యక్తి వచ్చాడు. జవహర్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్‌ అతడితో గొడవ పడి రాము ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడిగా తరుణ్‌గౌడ్‌



బోడుప్పల్‌: తెలంగాణ రాష్ట్ర యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడిగా బోడుప్పల్‌కు చెందిన పొన్నం తరుణ్‌గౌడ్‌ ఎన్నికయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో తాను గెలుపొందానని, కాంగ్రెస్‌ పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అధిష్టానం అప్పగించిన బాధ్యతలను త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం



ఉప్పల్‌: బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధించవచ్చని, సమస్యలను సాధించుకోవచ్చని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అభిప్రాయపడింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన హాడ్‌హాక్‌ కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించగా.. కమిటీ ప్రతినిధులు 75 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘం సమాఖ్య ద్వారా అనేక హక్కులను పోరాడి సాధించుకున్నామన్నారు. అన్ని రంగాల్లో ముందుకెళ్లాలంటే ఐక్యత ఎంతో అవసరమన్నారు. చెరువు రాంబాబు, ఆర్‌. రామచంద్రమూర్తి, ఎస్వీ శర్మ, ఎంఎస్‌ఎల్‌.రావు, శ్రీధర్‌బాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు స్వర్ణ భారత్‌ ట్రస్ట్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యువత స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్‌ రూరల్‌ సెల్ఫ్‌ ఎంప్లాయిమెంట్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ జూట్‌ బ్యాగ్‌ తయారీ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. 6 నుంచి 13రోజుల పాటు కొనసాగనుంది. 19 నుంచి 45 ఏళ్లున్న వారు అర్హులు. అభ్యర్థులు ఆధార్‌, 3 ఫొటోలు తీసుకురావాలి. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. 9391487797, 141712, 9618534720, 6301890681,9441728468.

వైభవంగా సుదర్శన హోమం



గౌతంనగర్‌: నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా ప్రజాపాలన విజయోత్సవాలు పురస్కరించుకుని లోక కళ్యాణార్థం దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆనంద్‌బాగ్‌ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. మూల మూర్తులకు ప్రత్యేక అలంకరణ సంకట విమోచన ఆంజనేయ స్వామికి అలంకరణలు నిర్వహించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏబీ.రవీంద్రారెడ్డి తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్లు, అర్చకులు, కాంగ్రెస్‌ పార్టీ నేతలు తదితరులున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ రామలింగం

బోడుప్పల్‌: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్‌ కమిషనర్‌ రామలింగం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం నాల్గోరోజు 8,9 డివిజన్లలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకే అందించాలన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని, అందుకు కాలనీవాసులు సహకరించాలని కోరారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేటర్లు లావణ్యశేఖర్‌రెడ్డి, సీసా వెంకటేష్‌గౌడ్‌, మున్సిపల్‌ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబసభ్యులు

ఆర్టీసీ ఉద్యోగుల సహపంక్తి భోజనాలు

బోడుప్పల్‌: ఆర్టీసీ ఉద్యోగులంతా చెంగిచర్ల డిపోలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకుని, ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. యాజమాన్యం ఆదేశాల మేరకు వంటకాలు తయారు చేయించి ఉద్యోగులతో కలిసి డిపో మేనేజర్‌ కవిత బుధవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సమిష్టి సహకారం, సమన్వయం, అంకిత భావంతో ఆర్టీసీ సంస్థ ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మరింత పట్టుదల, సమన్వయంతో పనిచేస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. ఉద్యోగుల ఆటలపాటల మధ్య వారి పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చిక్కడు.. దొరకడు

- బస్సు ప్రయాణికులే లక్ష్యంగా సెల్‌ఫోన్ల దొంగతనం
- మద్యం సేవించినట్లు నటనతో వదిలేసిన పోలీసులు



ఉప్పల్‌: ఆర్టీసీ ప్రయాణికులే లక్ష్యంగా ప్రయాణికుల వద్ద నుంచి తరచూ సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్న యువకుడిని సిబ్బంది చాకచక్యంగా అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఉప్పల్‌ విజయపురి కాలనీలో నివాసం ఉండే ఇంటర్‌ చదువుతున్న అరవింద్‌ చంద్రా ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ఫుట్‌బోర్డుపై నుంచి దుండగుడు అతని జేబులోంచి సెల్‌ఫోన్‌ కొట్టేసి పారిపోతుండగా పట్టుకున్నారు. చివరకు ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది, పోలీసుల సహాయంతో ఆటోలో తీసుకొచ్చి ఉప్పల్‌ పోలీసులకు అప్పగించారు. ఫుట్‌గా మద్యం సేవించినట్లు నటించి స్టేషన్‌లోనే పడిపోయాడు. దీంతో నిజంగానే పడిపోయాడేమోనని భావించిన పోలీసులు కొద్దిసేపు స్టేషన్‌లో ఉంచి అనంతరం పంపించి వేశారు.
- సదరు వ్యక్తి ఫుట్‌గా మద్యం సేవించి ఉన్నాడని ఏమి చేస్తున్నాడో తెలియకుండా ప్రవర్తించాడని పోలీసులు చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న గ్రేట్‌ బాంబే సర్కస్‌

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి మేడిపల్లి చెంగిచెర్ల ఎక్స్‌రోడ్డులో క్రోమా జి.టి.సిగ్నోడియా మైదానంలో బాంబే సర్కస్‌ ఆకట్టుకుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇథియోపియన్‌, ఆఫ్రికన్‌, చైనీస్‌, రష్యన్‌ కళాకారులతో దేశంలోనే మొదటిసారిగా ప్రదర్శనలు అలరించాయి. ప్రతిరోజు మూడు షోలతో అన్ని వయసుల ప్రేక్షకులు మాయాజాలాన్ని చేసే ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయి. కొన్ని అడవి జంతువులతో కూడిన ప్రదర్శనలు, డాగ్‌ షో, ఫ్లయింగ్‌ గ్రావేజ్‌, ఫైర్‌డ్యాన్స్‌, జోకర్స్‌తో ఆకట్టుకున్నాయి. ఈ గ్రేట్‌ బాంబే సర్కస్‌ ఈనెల 16 వరకు అహూతులు, చిన్నాపెద్దలను అలరించనుందని నిర్వాహకులు ప్రకటించారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.00 గంటలకు, అనంతరం రాత్రి 7.00 గంటలకు సర్కస్‌ షోలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


గ్రేట్‌ బాంబే సర్కస్‌ ప్రదర్శన